క్లుప్తంగా

నేటి నుంచి మజ్జి గౌరమ్మ ఆలయ వార్షికోత్సవం

భామిని: మండలంలోని బిల్లుమడలో వెలసిన శ్రీ మజ్జిగౌరమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం ఉగాది నుంచి జరగనుంది. ప్రతి ఏడాది ఉగాది రోజున గ్రామ మహిళలు ముర్రాటలతో ఊరేగింపు చేసి మజ్జి గౌరమ్మకు సమర్పించడం ఆనవాయితీ. ఐదు రోజుల పాటు వార్షిక ఉత్సవాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడానికి ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు వచ్చి మొక్కులు తీర్చుకుంటారు.

ఉగాది శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే



వీరఘట్టం: క్రోధి నామ సంవత్సరంలో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి నియోజకవర్గ ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. జీవితంలో కష్టసుఖాలు సహజమని, వాటిని తట్టుకునే మనోస్థైర్యం ప్రజలందరికీ ఉండాలని కోరారు. వర్షాలు సమృద్ధిగా కురిసి, పంటలు సంవృద్ధిగా పండి రైతులు సంతోషంగా ఉండాలని కోరారు.

నేడు ఉత్తరాంధ్రా స్థాయి వాలీబాల్ టోర్నీ

పాలకొండ రూరల్: స్థానిక పెదకాపు వీధి జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో ఉత్తరాంధ్ర స్థాయి వాలీబాల్ టోర్నీ మంగళవారం నిర్వహించనున్నట్లు నిర్వాహక కమిటీ సభ్యులు సోమవారం తెలిపారు. తెలుగు సంవత్సరాదిని పురస్కరించుకుని ఈ క్రీడా పోటీలను రెండు రోజుల పాటు నిర్వహించనున్నారు. ఫ్లడ్‌లైట్స్ వెలుగులో పోటీలు జరగనున్నాయి. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు ఉత్తమ ప్రతిభ కనపర్చిన క్రీడాకారులకు ప్రత్యేక బహుమతులు అందించాలని కమిటీ నిర్ణయించింది. ఈ పోటీల్లో నాలుగు జిల్లాలకు చెందిన 12 జట్లు తలపడనున్నాయి.

సారా తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

జియ్యమ్మవలస: ఒడిశా రాష్ట్రం సందుబడి గ్రామం నుంచి సోమవారం అక్రమంగా 40 లీటర్ల సారా తరలిస్తున్న చినమేరంగి గ్రామానికి చెందిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై చిన్నంనాయుడు తెలిపారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

పాఠశాలకు సొంత భవనం



పాత పాఠశాల భవనం



నిర్మాణంలో ఉన్న పాఠశాల భవనం

సీతంపేట: సీతంపేట ఏజెన్సీలో ఎత్తైన కొండలపై ఉన్న గడికారెం గ్రామంలో పాఠశాలకు సొంత భవనం లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. రేకుల షెడ్డులో పాఠశాల నిర్వహిస్తున్న సమయంలో వర్షాలు పడితే విద్యార్థులు, ఉపాధ్యాయులు బిక్కు,బిక్కుమంటూ గడుపుతున్నారు. గత టీడీపీ ప్రభుత్వం ఈ పాఠశాలను పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆధ్వర్యంలో పాఠశాల భవనాలకు రూ.12లక్షల నిధులు మన బడి నాడు–నేడు పథకంలో మంజూరయ్యాయి. దీంతో శరవేగంగా పాఠశాల నిర్మాణం జరుగుతుండడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పోలీస్ కవాతు



తుంబలిలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

జియ్యమ్మవలస: సార్వత్రిక ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించడంలో భాగంగా తుంబలి, చిన తుంబలి, రావాడ గ్రామాల్లో పోలీస్ బలగాలు సోమవారం కవాతు నిర్వహించాయి. ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని, శాంతియుత ఎన్నికల నిర్వహణకు సహకరించాలని చినమేరంగి ఎస్ఐ చిన్నంనాయుడు పిలుపునిచ్చారు. శాంతిభద్రతలకు విఘాతం కల్పించేవారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చురుగ్గా శ్రీరామనవమి ఉత్సవ ఏర్పాట్లు

సాలూరు: శ్రీరామనవమి ఉత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చురుగ్గా చేస్తున్నారు. సాలూరు పట్టణంలోని పెదకోమటిపేట, వెలంపేట, గాడివీధి, మెంటాడ వీధి, వెంకటేశ్వర కాలనీ, నెయ్యిలవీధి తదితర ప్రాంతాల్లో శ్రీరామనవమి ఉత్సవ ఏర్పాట్లు ఘనంగా చేస్తున్నారు.

కొమరాడలో సంక్షేమ విప్లవం



గ్రామ సచివాలయం



ఆర్‌బీకే



తరగతి గదిలో ఏర్పాటు చేసిన డిజటల్ బోర్డు

- ప్రగతి పథంలో కొమరాడ
- లబ్ధిదారుల ఇంట 'నవరత్న' వికాసం
- అర్హుల ఖాతాలకు ఐదేళ్లలో రూ.6.89 కోట్లు జమ
- రూ.81లక్షలతో విద్యాలయాలకు సొబగులు

కొమరాడ:

ఇటు ఆంధ్రా.. అటు ఒడిశా సరిహద్దులో ఉన్న కొమరాడ గ్రామంపై గత టీడీపీ ప్రభుత్వం శీతకన్ను వేసింది. ఒక్క అభివృద్ధి పనినీ పూర్తిస్థాయిలో చేయలేదు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు జన్మభూమి కమిటీలు సూచించిన వారికే అందే పరిస్థితి. మండల కేంద్రమే అయినా మౌలిక సదుపాయాలు శూన్యం. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొమరాడ దశదిశ మారింది. ప్రతి ఇంటిలోనూ 'నవరత్న' వెలుగులు ప్రకాశిస్తున్నాయి. నాడు–నేడు నిధులతో పేదకుటుంబాల పిల్లలు చదువుకునే ప్రభుత్వ పాఠశాల, కళాశాలలు కొత్తసొబగులు అద్దుకున్నాయి. మౌలిక సదుపాయాలు పెద్ద ఎత్తున కల్పించింది. ప్రభుత్వ భవనాలను నిర్మించింది. ఎలాంటి సిఫార్సులు లేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు మంజూరయ్యాయి. పేద కుటుంబాల్లో ఆర్థికోన్నతి స్పష్టంగా కనిపిస్తోంది. జగన్‌మోహన్‌రెడ్డి 58నెలల పాలనతో ప్రతీ కుటుంబం బాగుపడిందని, కొమరాడ కొత్తరూపు సంతరించుకుందంటూ స్థానికులు సంతోషం వ్యక్తంచేస్తున్నారు. ప్రభుత్వం చేసిన మంచిని గుర్తించుకుంటామని చెబుతున్నారు.

కొమరాడ ప్రజలకు వివిధ పథకాలు కింద మంజూరైన నిధులు ఇలా..

పథకం	లబ్ధిదారులు	ఆర్థికప్రయోజనం (రూపాయల్లో)
జగనన్న అమ్మఒడి	469	2,05,99,680
జగనన్న విద్యాదీవెన	352	1,04,29,545
జగనన్న వసతిదీవెన	265	42,41,538
వైఎస్సార్ రైతు భరోసా	522	2,64,04,000
వైఎస్సార్ ఉచిత పంటల బీమా	24	6,38,722
వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాలు	307	6,46,764
వైఎస్సార్ పెన్షన్ కానుక	826	7,84,20,000
వైఎస్సార్ చేయూత	492	2,27,81,250
వైఎస్సార్‌ఆసరా	773	1,63,51,634
వైఎస్సార్ సున్నా వడ్డీ	1144	15,70,299
వైఎస్సార్ కాపునేస్తం	2	1,05,000
వైఎస్సార్ ఈబీసీ నేస్తం	3	45,000
వైఎస్సార్ షాదీతోఫా	1	50,000
వైఎస్సార్ ఆరోగ్య శ్రీ	186	49,03,717
వైఎస్సార్ ఆరోగ్య ఆసరా	90	4,77,675
హౌసింగ్ లబ్ధిదారులకు నేరుగా చెల్లింపులు	131	1,67,80,929
వైఎస్సార్ బీమా	12	19,60,000
వైఎస్సార్ వాహన మిత్ర	39	12,50,000
జగనన్న చేదోడు	71	15,20,000
కోవిడ్ సహాయం	1,119	11,19,000
జగనన్న తోడు	78	40,875

నేరుగా లబ్ధిదారుల ఖాతల్లోకి జమచేసిన నగదు మొత్తం: రూ.21,03,90,588

కొమరాడ వాసులకు వివిధ పథకాల కింద మంజూరైన నిధులు

కార్యక్రమం	లబ్ధిదారులు	లబ్ధి (రూపాయల్లో)
ఇంటి స్థలాల భూసేకరణ, అభివృద్ధికి చెల్లించినది	136	3,34,56,000
జగనన్న విద్యా కానుక	318	22,58,436
8 తరగతి విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ	43	5,68,546
జగనన్న తోడు రుణాలు	121	22,52,899
జగనన్న గోరుముద్ద	294	29,12,658
వైఎస్సార్ సంపూర్ణ పోషణ	329	1,62,170
ఇంటింటికీ రేషన్	979	2,13,85,276
నాడు–నేడు నిధులు కళాశాలకు	1	69,00,000
నాడు–నేడు ద్వారా ఎంపీపీ స్కూల్‌కు	1	12,00,000

పరోక్షంగా కొమరాడ గ్రామానికి మంజూరు నిధులు మొత్తం: రూ. 7,70,95,985

మా ఊరు మారింది

కొమరాడ మండల కేంద్రమే అయినా గతంలో అభివృద్ధి శూన్యం. 58 నెలల జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో కొమరాడ ప్రజలకు వివిధ సంక్షేమ పథకాల కింద లక్షలాది రూపాయల ఆర్థిక ప్రయోజనం కలిగింది. మా ఊరు బడి, కళాశాల సుందరంగా ముస్తాబయ్యాయి. విద్యార్థులు చక్కగా చదువుకుంటున్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు కొత్త భవనాలు సమకూరాయి. ఊరు రూపు మారిపోయింది. మా గ్రామ అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి పాటుపడిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే పుష్పశ్రీవాణికి గ్రామస్తుల తరఫున ప్రత్యేక కత్యజ్ఞతలు.

– సిరికి గంగమ్మ, కొమరాడ సర్పంచ్



ఆధుని సొబగులు అద్దుకున్న కొమరాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

జగనన్నతోనే సంక్షేమం

- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి
- పల్లెల్లో హారతులు పట్టిన ప్రజలు



నవగాం ప్రచారంలో ఎమ్మెల్యేకు హారతులు పడుతున్న మహిళలు

పాలకొండ రూరల్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అనుక్షణం జనంతోనే మమేకమై ఉంటుందని..జగనన్నతోనే సంక్షేమం ముడిపడి ఉందని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. ఈ మేరకు సోమవారం ఆమె పాలకొండ మండలంలోని నవగాం, అవలంగి, జి.వెంకటాపురం, వంతవాడ, కొత్త వంతవాడ, కొత్త బర్న, సీతంపేట డోలమడ, ఆర్‌బీఆర్.పేట తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అడుగడుగునా ప్రజలు కళావతికి ఎదురువచ్చి విజయతిలకం దిద్దుతూ మంగళ హారతులు పట్టారు. విశ్వసనీయతకు మారుపేరుగా నిలిచిన కళావతిని ముచ్చటగా మూడోసారి ఎమ్మెల్యేగా గెలిపించుకుంటామంటూ పల్లెవాసులు ముక్త కంఠంతో నినాదాలు చేశారు. సంక్షేమ పథకాలను తమ గడపవద్దకు తీసుకువస్తున్న జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుంటామని చేతిలో చెయ్యి వేస్తూ అక్కచెల్లెమ్మలు, అవ్వాతాతలు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పాలకొండ వైఎస్సార్ సీపీ అభ్యర్థి కళావతి ప్రతి ఇంటికి వెళ్లి రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని, రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి, సంక్షేమాన్ని అందించేందుకు సిద్ధమంటున్న జగనన్నను నిండుమనసుతో ఆశీర్వదించాలని కోరారు.

మీ వెంటే మేము..

ఎన్నికల ప్రచారానికి తమ గ్రామాలకు వస్తున్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే కళావతి వెంట గ్రామీణ ప్రజలు అడుగులో అడుగు వేస్తూ సమీప గ్రామాలకు తరలివచ్చారు. మండుటెండను సైతం లెక్కచేయకుండా తమ అభిమాన నాయకురాలి వెంట పాదం కలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ బొమ్మాళి సుధా భాను, వైస్ ఎంపీపీ, మండల కన్వీనర్ కణపాక సూర్యప్రకాశ్, వాకముడి అనిల్‌కుమార్‌తో పాటు పలు గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, పీఏసీఎస్ అధ్యక్షులు తొర్లపాటి నీరజ, చిన్నారావు, లావేటి శ్యామ్ బాబు, నల్లి శివప్రసాద్, లోలుగు విశ్వేశ్వరావు, టి.ఉపేంద్ర, కోట అజయ్‌కుమర్, రణస్థలం రాంబాబు, గోగుల కల్యాణి, చింత సంఘం నాయుడు నరసయ్య, వెంకటరావు, గున్నయ్య, వారాడ సరస్వతి, కోట కృష్ణంనాయుడు, రమేష్‌నాయుడు, అప్పలనాయుడు, పైల వాసుదేవరావు, నెయిగాపుల జనార్దనరావు, బిడ్డిక వెంకయ్య, పొంగ్రంకి హైమావతి, పి.భుజంగరావు, ఎస్.ఆనందరావు, ఆర్.వాసుదేవరావు, మెయ్యి ఈశ్వరారవు, కె.సూర్యనారాయణ, మజ్జి నవీన్‌కుమార్, తాడేల జ్ఞానానందం, పి.రామచంద్రతోపాటు పాలకొండ నగరపంచాయతీ కౌన్సిలర్లు వెలమల మన్మథరావు, కడగల వెంటకరమణ, కిల్లారి మోహనరావు, కోడెం బాబి, ఇ.లిల్లీ పుష్పనాథం పాల్గొన్నారు.



ఎమ్మెల్యేతో కలిసి విజయ నినాదాలు చేస్తున్న మండల, పట్టణ ప్రజాప్రతినిధులు, ప్రజలు

శరవేగంగా సెల్‌టవర్ల నిర్మాణం

సీతంపేట: సార్వత్రిక ఎన్నికలుదగ్గరపడుతున్నాయి. అయితే ఇప్పటికీ పార్వతీపురం మన్యం జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో నెట్‌వర్క్ సమస్య వెంటాడుతోంది. ఈ నేపథ్యంలో ఎత్తైన కొండలపై ఉన్న మారుమూల గ్రామాల్లో సెల్ టవర్ల నిర్మాణం జోరుగా సాగుతోంది. ఈ క్రమంలో సీతంపేట ఏజెన్సీలో అత్యధికంగా 42 మొబైల్ టవర్ల నిర్మాణం జరుగుతోంది. వాటి నిర్మాణం పూర్తయితే ఎన్నికల సమాచారానికి ఎటువంటి ఇబ్బందులు ఉండవు. అయినప్పటికీ ఎన్నికల సమాచారాన్ని ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులకు ఇచ్చేందుకు వీలుగా ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్లు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు.



దిగువపల్లంకి వలసలో ఏర్పాటు చేసిన సెల్‌టవర్

దీర్ఘకాలిక రోగులకు వైద్యపరీక్షలు

గరుగుబిల్లి: మండలంలోని దళాయివలసలో సోమవారం ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహించారు. వివిధ ఆరోగ్యసమస్యలతో బాధపడుతున్నవారికి, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు స్థానిక వైద్యాధికారి కె.కె.సాగర్‌వర్మ, సిబ్బంది వైద్యపరీక్షలు చేశారు. అవసరమైన మందులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైద్యసేవలను ప్రభుత్వం ప్రజలకు చేరువచేసిందన్నారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటిస్తూ ఆరోగ్యకర సమాజ నిర్మాణంలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో డా. స్నిగ్ధ, సూపర్‌వైజర్ చిన్నమ్మ, రమణమ్మ, తదితర సిబ్బంది పాల్గొన్నారు.



రోగులను పరీక్షిస్తున్న వైద్యుడు సాగర్‌వర్మ

ఆరోగ్య సురక్షలో మెరుగైన వైద్య చికిత్సలు

పాలకొండ: జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని అన్నవరం పీహెచ్‌సీ వైద్యాధికారి కమలనాథ్ తెలిపారు. ఈ మేరకు సోమవారం మండలంలోని తంపటాపల్లి గ్రామంలో ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఆరోగ్య సురక్ష శిబిరాల ద్వారా మెరుగైన వైద్యం అందిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో 497 మందికి చికిత్సలు నిర్వహించారు. స్త్రీ ప్రసూతి, కళ్లు, ఎముకలు, చర్మవ్యాధుల నిపుణులు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. దీర్ఘకాలిక రోగులకు అవసరమైన చికిత్సలు అందజేశారు.



శిబిరంలో చికిత్స నిర్వహిస్తున్న వైద్యులు

నిబంధనల మేరకు తనిఖీలు ముమ్మరం

- డీఎస్పీ కృష్ణారావు

పాలకొండ: ఎన్నికల నిబంధనల మేరకు తనిఖీలు ముమ్మరం చేస్తున్నామని డీఎస్పీ కృష్ణారావు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన శ్రీకాకుళం రహదారిలో వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బందికి సూచనలు అందించారు. ప్రతి వాహనం విధిగా తనిఖీ చేయాలని స్పష్టం చేశారు. చెక్‌పోస్టులతో పాటు సిబ్బంది రోజుకో మార్గంలో ప్రత్యేక తనిఖీలు చేయాలని సూచించారు. ఎన్నికల నియమావళి అమలులో భాగంగా వాహనాలకు జెండాలు కడితే అనుమతులు తీసుకోవాలని స్పష్టం చేశారు. రాజకీయ పార్టీల ప్రచారంపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందన్నారు. ఆయనతో పాటు ఎస్సై ప్రశాంత్‌కుమార్ ఉన్నారు.



తనిఖీ చేస్తున్న డీఎస్పీ, సిబ్బంది

36 మంది వలంటీర్ల రాజీనామా

కురుపాం: ప్రజలకు స్వచ్ఛందంగా సేవలు అందిస్తున్న వలంటీర్లపై టీడీపీ కూటమి చేస్తున్న దుష్ప్రచారాన్ని ఖండిస్తూ కురుపాం మేజర్ పంచాయతీ సచివాలయం–1 పరిధిలో సేవలు అందిస్తున్న 21 మంది, సచివాలయం–2 పరిధిలో సేవలందిస్తున్న 15 మంది వలంటీర్లు సోమవారం రాజీనామా చేశారు. వీరంతా మూకుమ్మడిగా పంచాయతీ ఈఓ కె.చంద్రశేఖర్‌కు రాజీనామా పత్రాలను అందజేశారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో టీడీపీ కూటమికి తామంతా బుద్ధి చెబుతామని స్పష్టంచేశారు.

నడిమికెల్లలో 18 మంది వలంటీర్లు

వీరఘట్టం: వలంటీర్ల సేవలు ప్రజలకు అందకుండా టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి కుట్రకు నిరసనగా వీరఘట్టం మండలం నమిమికెల్లకు చెందిన 18 మంది వలంటీర్లు మూకమ్మడిగా సోమవారం రాజీనామా చేశారు. పంచాయతీ కార్యదర్శి కోటేశ్వరరావుకు రాజీనామా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన వలంటీర్ల వ్యవస్థతో 58 నెలలుగా ప్రజలకు ఉత్తమ సేవలందాయన్నారు. ప్రభుత్వానికి ఆదరణ పెరగడంతో కూటమి అభ్యర్థులు వలంటీర్ వ్యవస్థపై విషంకక్కుతున్నారన్నారు. వలంటీర్లను ప్రభుత్వానికి దూరం చేసేలా ఈనాడు తప్పుడు కథనాలు ప్రచురిస్తోందని తెలిపారు. వీరందరికీ బుద్ధిచెప్పేరోజు కొద్దిరోజుల్లోనే ఉందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకుంటామని, సంక్షేమ, అభివృద్ధి పాలనను ప్రజలకు చేరువచేయడంలో మేమంతా భాగస్వాములమవుతామని స్పష్టం చేశారు. జగనన్న సైన్యంగా ప్రజలకు సేవలందిస్తామన్నారు.



రాజీనామా పత్రాలతో కురుపాం మేజర్ పంచాయతీ వలంటీర్లు



వీరఘట్టం: నడిమికెల్ల సచివాలయం పంచాయతీ కార్యదర్శికి రాజీనామా పత్రాలు అందజేస్తున్న వలంటీర్లు

సంవత్సరారంభమే ఉగాది



గురండిలో నాగళ్లు తయారు చేయిస్తున్న రైతులు

భామిని: నూతన తెలుగు సంవత్సరంగా పిలిచే ఉగాది రోజు నుంచి వ్యవసాయ పనులు ఆరంభం కానున్నాయి. ఈ నెల 9వ తేదీ మంగళవారం చైత్రశుద్ధ పాడ్యమి నుంచి క్రోధి నామ తెలుగు సంవత్సర ఆరంభంలో రైతులు వ్యవసాయ పనులు మొదలు పెట్టనున్నారు. రైతులు ఏరువాకగా పిలిచే హలకర్మను పవిత్రంగా నిర్వహిస్తారు. పొలంలో ఏరువాక కార్యక్రమంలో దుక్కిదున్ని వ్యవసాయ పనులు ఆరంభిస్తారు. ఉగాది రోజున వేకువజామున 4.30గంటల నుంచి 5.20గంటల లోగా హలకర్మకు శుభంగా బత్తిలి పురోహితుడు రంపా లలితప్రసాద్ శర్మ తెలిపారు. ఏరువాకకు అవసరమైన నాగళ్ల తయారీకి పాలకర్ర, మర్రి, మద్ది, మామిడి కలపతో తయారు చేయించిన నాగళ్లనే వాడుకోవాలని పంచాగకర్తలు చెబుతున్నారు. హలకర్మకు రైతులు కొత్త నాగళ్లు, కొత్త పశువుల సేకరణ, వ్యవసాయ పనులకు అవసరమైన కన్నెలు, మోకులు సిద్ధం చేశారు. ఉగాది రోజున ఉదయం 10.15గంటల నుంచి 11 గంటలలోపు అశ్వని నక్షత్రయుత మిధున లగ్నంలో కొత్త ఖాతాలు, పుస్తకాలు ప్రారంభించానికి, కొత్త వస్తువుల వాడకానికి శుభం. ఇప్పటికే కొత్త సంవత్సర పంచాంగ శ్రవణం కార్యక్రమాలు ఆరంభమయ్యాయి.

ఇంటికో పందిరి

సీతంపేట: సీతంపేట ఏజెన్సీలోని మారుమూల పల్లంకి వలసలో ఇంటికో పందిరి కూరగాయల సాగు చేపడుతున్నారు. గ్రామంలో దాదాపు 20 కుటుంబాలు నివసిస్తుండగా దాదాపు అందరి ఇళ్ల వద్ద పందిరి కూరగాయల మొక్కలు అల్లుకుని ఉండడం విశేషం. చిక్కుడు, బీర తదితర రకాల పాదులు వేసి పెంచుతున్నారు. పట్టణ ప్రాంతాలకు దూరంగా ఉండడం, అవసరమైనప్పుడు కూరగాయలు లభించకపోవడంతో ఇలా పందిరి మొక్కలు వేసుకుంటే అవసరమైనప్పుడు వండుకోవచ్చని, ఇది ఎంతో ఉపయోగపడుతుందని గిరిజనులు తెలియజేస్తున్నారు.



ఓ ఇంటివద్ద అల్లుకున్న పందిరి మొక్కల సాగు

రూ.2కోట్లతో బీటీ రహదారి

కురుపాం మండలం ఆవిరి నుంచి తిత్తిరి వైపు వెళ్లే రహదారి టీడీపీ పాలనలో గోతులమయంగా ఉండేది. దీంతో ఆర్టీసీ సర్వీసులు సైతం నడిచేవి కావు. ప్రజలు అవస్థలు పడేవారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి చొరవతో ఈ రహదారికి రూ.2కోట్లు మంజూరయ్యాయి. ఆర్‌అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో చురుగ్గా పనులు చేపట్టి పూర్తి చేశారు. ప్రస్తుతం ఆర్టీసీ సర్వీసులు నడుస్తున్నాయి. దీంతో ఈ ప్రాంత ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

– కురుపాం



అధ్వానంగా ఉన్న ఆవిరి నుండి తిత్తిరి వెళ్లే రహదారి



ఆవిరి నుండి తిత్తిరి గ్రామానికి వేసిన బీటీ రహదారి

పల్లెల్లో పంచాంగ శ్రవణం

గరుగుబిల్లి: మండలంలోని రావివలస, పెద్దూరు, గరుగుబిల్లి, రావుపల్లి, చినగుడబ, నాగూరు తదితర గ్రామాల్లో పంచాంగ శ్రవణ కార్యక్రమాన్ని సోమవారం సాయంత్రం నిర్వహించారు. ఉగాది సందర్భంగా క్రోధనామ సంవత్సర పంచాంగంలో శుభ, అశుభ ఫలితాలను, వర్ష ఫలితాలను పురోహితులు వివరించారు. కొత్త వ్యాపారాల ఆరంభం, నూతన వస్తువుల కొనుగోలుకు శుభముహూర్తాలను తెలిపారు. రైతులకు కలిసివచ్చే పంటల వివరాలను తెలియజేశారు. వర్షం, రాశుల ఫలాలను వివరించారు. పంచాంగ శ్రవణం కార్యక్రమంలో గ్రామపెద్దలు, రైతులు పాల్గొన్నారు.



రావివలసలో పంచాంగ శ్రవణంలో పాల్గొన్న పెద్దలు, రైతులు